చదరంగంలో సత్తా..
- నంద్యాలలో రాష్ట్రస్థాయి పోటీలు 7

ఒకే ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం
- రూ.65వేలు తల్లి ఖాతాలో జమ 7
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



ప్రహ్లాద జోషికి స్వాగతం పలుకుతున్న నాయకులు, అధికారులు

మంత్రాలయం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన కేంద్ర పౌర సర ఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాదజోషికి ఆదివారం రాత్రి తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో అధికారులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పద్మనాభతీర్థ గెస్టు హౌస్ వద్ద మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పైబావి అమర్నాథ్ రెడ్డి, జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, కర్ణాటక మాజీమంత్రి శివన్నగౌడునాయక్ పుష్పగుచ్ఛమిచ్చి ఘన స్వాగతం పలికారు. రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. రాష్ట్రంలో అమలుపరుస్తున్న కేంద్ర పథకాలపై కొంతసేపు చర్చించారు. కేంద్రమంత్రి సోమవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకోనున్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్ర మైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడి గా మారింది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్ భక్తులతో కిక్కిరిసింది.



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం

ప్రధాని పర్యటన బందోబస్తుకు 298 మంది పోలీసులు

కర్నూలు క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్టణానికి రానున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన భద్రతా విధుల్లో జిల్లా నుంచి 298 పోలీసులు పాల్గొననున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 13 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 57 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 188 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 14 మంది మహిళా కానిస్టేబుళ్లు పాల్గొంటారు. కర్నూలు సబ్ డివిజన్ నుంచి 147 మంది, ఆదోని సబ్ డివిజన్ నుంచి 47 మంది, పత్తికొండ సబ్ డివిజన్ నుంచి 52 మంది ఎమ్మిగనూరు నుంచి 53 మంది వెళ్తారు.

ఈరోడ్డు బాగవుతుందా?

- అధ్వానంగా డాణాపురం -హొళగుంద ప్రధాన రహదారి
- అడుగడుగున గుంతలు
- 25 గ్రామాల ప్రజల అవస్థలు
- గత వైసీపీ హయాంలో పర్సెంటేజీల భాగోతంతో ప్రజలకు శాపం



కర్నూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):
గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలు ఏడాదైనా ప్రజలను వెంటాడుతున్నాయి. రహదారుల నిర్మాణానికి మంజూరైన నిధుల్లో అప్పటి వైసీపీ ప్రజా ప్రతినిధులు ఇష్టారాజ్యంగా పర్సెంటేజీలు డిమాండ్ చేసి కాజేశారు. వాటాలు ఇవ్వకపోతే పనులు చేయనివ్వమని తేల్చిచెప్పడంతో కాంట్రాక్టర్లు పారిపోయారు. ఆ పాపాలు ఇప్పటికీ ప్రజలను వేధిస్తున్నాయి. 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే హొళగుంద-డాణాపురం ప్రధాన రోడ్డు ఆధునికీకరణ కోసం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) మంజూరు చేసిన నిధుల్లో వైసీపీ నాయకులు పెద్ద మొత్తంలో పర్సెంటేజీలు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా నిబంధనలు అడ్డుగా ఉండడంతో మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా ఐదారేళ్లుగా రోడ్లు గుంతలమయంగా ఉండి పోయాయి.

డాణాపురం-హొళగుంద రోడ్డు ఆంధ్రా-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేసే అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి. ఆదోని-బళ్లారి వయా ఆలూరు జాతీయ రహదారి-167 డాణాపురం క్రాస్ 0/0 కి.మీల నుంచి హొళగుంద వరకు 25.490 కిలోమీటర్లు ఉంది. హొళగుంద, ఆదోని మండలాల పరిధిలోని 25 గ్రామాలకు పైగా ప్రజలు రాకపోకలకు సాగించే కీలకమైన రోడ్డు ఇది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, హోస్పేట్ ప్రాంతాల నుంచి వివిధ గ్రామాల ప్రజలు మంత్రాలయం, శ్రీశైలం వెళ్లాలన్నా, జిల్లా వాసులు కర్ణాటకలోని హంపి క్షేత్రానికి వెళ్లాలన్నా ఈరోడ్డే ఆధారం. నిత్యం 500-700కు పైగా వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టీబీపీ ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు, వివిధ గ్రామాల రైతులు వ్యవసాయ ఉత్పత్తులు ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించాలంటే ఈరహదారి గుండానే సాగిపోయాలి. ఐదేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డంతా గుంతలు గుంతలుగా మారింది. కొన్ని చోట్ల రెండు మూడు అడుగుల లోతు గుంతలు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.



హొళుగుంద-డాణాపురం రోడ్డు హెబ్బటం సమీపంలో గుంతల మయం

నాటి వైసీపీ నేతల..

డాణాపురం-హొళగుంద ప్రధాన రోడ్డును డబుల్ రోడ్డును ఆధునికీకరణ కోసం వైసీపీ ప్రభుత్వ హయాంలో న్యూ డెవలఎమెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) కింద 2021లో నిధులు రూ.63కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తిచేశారు. పనులు దక్కించుకున్న ఎన్ఎస్‌పీఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ కాంట్రాక్టర్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టింది. ఇక్కడే అసలు సమస్య వచ్చింది. ఈ రోడ్డు ఆలూరు, ఆదోని నియోజకవర్గాల పరిధిలోకి వస్తుంది. వైసీపీ హయాంలో ఆపార్టీకి చెందిన రెండు నియోజకవర్గాల ముఖ్య ప్రజాప్రతినిధులు వాటాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇద్దరికి పర్సెంటేజీ ఇస్తే నష్టం వస్తుందని, పనులు చేయలేనని కాంట్రాక్టర్ తేల్చిచెప్పినా, ప్రజాప్రతినిధులు పట్టుబట్టారు. దీంతో ఆయన ఈపనులు చేయలేను అంటూ చేతులెత్తేశారు. ఇప్పటికే ఎన్‌డీబీ పథకం కింద నిధులు మంజూరు కావడంతో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయాలన్నా నిబంధనలు అడ్డుగా మారాయి. గుంతల రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కూటమి ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



హొళగుంద సమీపంలో గుంతలుగా మారిన హొళుగుంద-ఢాణాపురం రోడ్డు

ఆ.. రోడ్లు అధ్వానమే..:

ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఎమ్మిగనూరు, నందవరం, పెద్దకడుమూరు, కోసిగి, కౌతాళం మండలాల ప్రజలకు ప్రధానమైన రహదారి ఎమ్మిగనూరు-మాలపల్లి-కోసిగి రోడ్డు. 0/0 నుంచి 11.885 కిలో మీటర్ల వరకు అడుగు తీసి అడుగుల వేయలేనంతగా ధ్వంసమైపోయింది. గుంతల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కౌతాళం మండలం ఉరుకుంద లక్ష్మీనరసింహస్వామి (ఈరన్న) క్షేత్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు ఇది. అలాగే.. ఆదోని-ఎమ్మిగనూరు (ఏజీ రోడ్డు) జాతీయ రహదారి-167 బైచిగేరి క్రాస్ నుంచి పెద్దకడుబూరు వయా కపటి రోడ్డు 0/0 నుంచి 13.750 కిలోమీటర్లు అధ్వానంగా మారింది. అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సింగిల్ రోడ్డుకైనా నిధులు ఇవ్వండి

ప్రజల అవస్థలు నివారించాలంటే డబుల్ రోడ్డు స్థానంలో కనీసం సింగిల్ రోడ్డు నిర్మాణం కోసమైనా నిధులు ఇవ్వాలని కోరుతూ రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు డాణాపురం-హొళగుంద రోడ్డుకు రూ.14 కోట్లు, ఎమ్మిగనూరు-మాలపల్లి-కోసిగి రోడ్డుకు రూ.6 కోట్లు, కపటి-పెద్దకడుబూరు రోడ్డుకు రోడ్డుకు రూ.7.50కోట్ల చొప్పున రూ.27.50కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపించారు. దీనిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి నేడు సీఎం చంద్రబాబును కలవనున్నారు. అలాగే.. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

జలాధివాసంలో సంగమేశ్వరుడు

- క్షేత్రాన్ని ముంచెత్తుతున్న వరద జలాలు
- చివరి రోజు క్షేత్రంలో అంత్యపూజలు



సంగమేశ్వరాలయాన్ని ముంచెత్తిన వరదజలాలు



సంగమేశ్వరాలయ ఆవరణలోకి చేరిన వరదనీరు



ఉత్తర ద్వారం గుండా ఆలయ ప్రాంగణంలోకి చేరుతున్న వరద జలాలు

ఆత్మకూరు/ కొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం పెరిగి, బ్యాక్‌వాటర్ ప్రదేశంలో వెలసిన సప్తనదుల సంగమేశ్వర క్షేత్రాన్ని ముంచెత్తింది. ఈక్రమంలోనే ఆదివారం ఉదయం 6.30 గంటల సమయానికి వరదజలాలు గర్భాలయంలోకి ప్రవేశించి వేపదారు శివలింగాన్ని స్పృశించాయి. ఆ తర్వాత నెమ్మదిగా నీటిమట్టం పెరగడంతో గర్భాలయంలోని సంగమేశ్వరుడు పూర్తిగా జలాధివాసమయ్యారు. ఆదివారం సాయంత్రం 6గంటల సమయానికి జూరాల నుంచి 15,808 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 6660 క్యూసెక్కుల చొప్పున మొత్తం 22,468 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైల జలాశయానికి చేరుతోంది. దీంతో డ్యాం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను.. 840.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. అలాగే గరిష్ఠ నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను 62.4320 టీఎంసీల నీటినిల్వలు వున్నాయి.



వరద జలాలకు వాయనం సమర్పిస్తున్న అర్చకుడు తెలకపల్లి రఘురామశర్మ

86 రోజులపాటు పూజలందుకున్న సంగమేశ్వరుడు

శ్రీశైలానికి గత ఏడాది జూలై 23వ తేదీన వరద వచ్చిచేరడంతో సంగమేశ్వరుడు జలాధివాసం అయ్యారు. ఆ తర్వాత 242 రోజుల పాటు నదీగర్భంలో ఒదిగిన సంగమేశ్వరుడు ఈ ఏడాది మార్చి 22వ తేదీన పూర్తిగా బయల్పడి తిరిగి పూజలందుకున్నారు. అప్పటి నుంచి 86 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న సంగమేశ్వరుడు మళ్లీ జలాధివాసమయ్యాడు. కాగా శ్రీశైలం జలాశయం వెనకతట్టు జలాల్లో 1981లో జలాధివాసమైన సంగమేశ్వరుడు సుమారు 22ఏళ్ల పాటు నదీగర్భంలోనే ఉండి ఆ తర్వాత 2003లో తొలిసారిగా నదీజలాల నుంచి బయల్పడ్డాడు. సంగమేశ్వర క్షేత్ర చరిత్రలో 86రోజుల వ్యవధిలోనే సంగమేశ్వరుడు జలాధివాసం కావడం అదే ప్రథమంగా చెప్పవచ్చు.

చివరి రోజు సంగమేశ్వరుడికి అంత్యపూజలు

సంగమేశ్వర క్షేత్రంలోని లలితా సంగమేశ్వర స్వామి, అమ్మవార్లు జలాధివాసం కానుండటంతో చివరి రోజైన ఆదివారం ఆలయ ప్రధాన పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ అంత్యపూజలు నిర్వహించారు. ముందుగా వేపదారు శివలింగానికి రుద్రభిషేకం గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. తదుపరి స్వామివారికి జలాధివాస జయమంగళ హారతిని నివేదించారు. సంగమేశ్వరాలయం జలాధివాసమయ్యే అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

చిరుతల కలకలం

- భయాందోళనలో కోసిగి ప్రజలు
- బంధించే క్రమంలో యువకుడిపై దాడి చేసిన ఓ చిరుత

వంకలో పడుకున్న చిరుత




కోసిగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని పులికనుమ ప్రాజెక్టు సమీపంలోని బసవన్నకొండ దగ్గరలోని ఎర్రవంకలో ఓ చిరుత గాండ్రిస్తూ.. నడవలేని స్థితిలో ఉంది. శబ్దం విన్న రైతులు ముందు ఆ చిరుతను చూసి భయపడి గ్రామంలోకి పరుగులు తీశారు. అయితే సుమారు గంటలు కావస్తున్నా.. చిరుత ఉన్న చోట నుంచి ముందుకు కదలకపోవడంతో ఎస్ఐ హనుమంతరెడ్డికి, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అక్కడి చేరుకొని అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రజలను వెళ్లిపోవాలని ఆయన హెచ్చరించారు. ఎవరూ చిరుతకు హానీ కలిగించకూడదని సూచనలు చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి 3 గంటల సమయంలో చిరుత కొద్దిగా తేరుకుని ముందుకు నడిచింది. దగ్గరలో ఉన్న ప్రజలను చూసి గాండ్రించడంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. ప్రజలను ఎస్ఐ, పోలీసు సిబ్బంది అప్రమత్తం చేసి అక్కడి నుంచి పంపించారు. డీఎఫ్‌వో శ్యామల, డీఎఫ్‌వో ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు, ఆదోని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తేజశ్విని, బీట్ ఆఫీసర్ అనూరాధతో పాటు సిబ్బంది అక్కడ చేరుకున్నారు. అటవీ సిబ్బందితో పాటు యువకులు చిరుతను బంధించే క్రమంలో ఓ యువకుడిపై చిరుత దాడి చేసింది. ఆ యువకుడి గాయాలయ్యాయి. చివరకు ఆ చిరుతను బోనులో బంధించి ఆదోనికి తీసుకెళ్లారు. శ్రీశైలం నుంచి వైద్యులు వచ్చిన తర్వాత పరిశీలిస్తారని,

మిగతా 7లో...



చిరుతను బోనులో బంధించిన దృశ్యం



చిరుతను చూడడానికి తరలి వచ్చిన ప్రజలు



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్



ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ఘనంగా డీసీఎంఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేసిన నాగేశ్వరరావు యాదవ్
- హాజరైన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరావు యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. డీసీఎంఎస్ జిల్లా అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా కర్నూలు ఎమ్పీ నాగరాజు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు నరహరి విశ్వనాథరెడ్డి, రాష్ట్ర టీడీపీ నాయకులు ఏవీఆర్ ప్రసాద్, ఎన్ఎండీ ఫిరోజ్, వీరభద్రగౌడ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పార్టీలో చిన్నప్పటి నుంచి నేటి వరకు పని చేస్తున్న నాగేశ్వరరావుయాదవ్‌ను పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పించిందన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచక పాలనతో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నామని, పార్టీ జెండాయే ముఖ్యమని ఎన్ని కేసులనైనా ఎదుర్కొని నిలిచిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరరావుయాదవ్ ప్రతి ఒక్కరికీ సుపరిచితుడని, కష్టపడే మనస్తత్వంగల వ్యక్తి అన్నారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ శాశ్వత కరువు, వలసల నిర్మూలనకు కృషిచేయాలని, సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ప్రతి రైతుకు అండగా ఉంటానని అన్నాడు.

సంక్షేమ పథకాలకు ఎగనామం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎగనామం పెడుతున్నదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500 ఇచ్చే సంక్షేమ పథకాలకు పూర్తిగా ఎగనామం పెట్టిందన్నారు. టీడీపీ నేతల అక్రమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎంపీ, మంత్రులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తుందన్నారు. వైసీపీ ఒత్తిడితోనే తల్లికి వందనం అమలు చేశారని అన్నారు. ఈ సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, నగర మేయర్ బీవై. రామయ్య, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎస్వీ. విజయమనోహరి, కోడుమూరు ఇన్‌చార్జి సతీష్ పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం

● మేనిఫెస్టో హామీలు అమలు

● ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఏడాది పాలనపై సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసం, అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి 94 శాతం సీట్లతో అధికారం కట్టబెట్టారన్నారు.తొలి ఏడాదిలోనే సంక్షేమం, రెట్టింపు పథకాలతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఓ పక్క ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మరో పక్క అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితో వైసీపీ నాయకులు బురదచల్లే నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు మానుకొని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు.

ఒకే ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం

● రూ.65వేలు తల్లి ఖాతాలో జమ

● సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ఐదుగురు పిల్లలతో తల్లిదండ్రులు

కోసిగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఒకే ఇంట్లో ఐదుగురు విద్యార్థులకు 'తల్లికి వందనం' డబ్బులు జమ అయ్యాయి. కోసిగిలోని 7వ వార్డుకు చెందిన బెళగల్ నరసమ్మ, ఈరేష్ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఐదుగురు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.13వేల ప్రకారం రూ.65వేలు తల్లి ఖాతాలో జమ అయ్యాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు బెలగల్ నరసమ్మ, వీరేష్ సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శ్రీలత (7వ తరగతి) చదువుతుంది. స్థానిక జేబీఎం ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులైన గాయత్రీ (5వ తరగతి), అంజలి (4వ తరగతి), శాంతి (2వ తరగతి), నరసింహ (1వ తరగతి) చదువుతున్నారు. ఆదివారం డబ్బులు తమ ఖాతాలో జమ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి సమక్షంలో కాలనీవాసులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి క్షీరాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి రుణపడి ఉంటామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

వీఆర్వో పోస్టులు తగ్గించడం అన్యాయం

● ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మౌలిబాషా



మాట్లాడుతున్న వీఆర్వో సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రేషనలైజేషన్ పేరుతో వీఆర్వో పోస్టులు తగ్గించడం చాలా అన్యాయమని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మౌలి బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాత పద్ధతి ప్రకారం ప్రతి గ్రామానికి ఒక వీఆర్వోను కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంటు జారీ చేసిన జీవో.నెం.5తో సంబంధం లేకుండా గ్రేడ్-1 వీఆర్వోల బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉన్న గ్రేడ్-2 వీఆర్వోల కోసం గ్రేడ్-1 వీఆర్వోల బదిలీలు ఆపడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సరాజు, కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షుడు బుద్ధకవి ఉన్నారు.

శ్రీమఠంకు రూ.4.50 లక్షలు విరాళం

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి శ్రీమఠానికి ముంబైలోని థానే పట్టణానికి చెందిన ప్రశాంత్ కృష్ణాపూర్ అనేభక్తుడు అన్నదానంకు, దైనందిక సేవకు రూ.4.50లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆదివారం విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, శ్రీపాద ఆచార్, దేశాయ్ నరసింహ ఆచార్‌లు పాల్గొన్నారు.

చదరంగంలో సత్తా..

● ప్రతిభ ముందు చిన్నబోయిన అంధత్వం

● ఉద్యోగం చేసుకుంటూనే చెస్ సాధన

● రైతు కుటుంబాల నుంచి వచ్చి అద్భుత ప్రతిభ

● ఫిడే రేటింగ్‌లో కూడా స్థానం

● రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు



టాప్ ఫిడేరేటింగ్ క్రీడాకారుల పోటీ

నంద్యాల హాస్పిటల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంధత్వం వారి ప్రతిభ ముందు చిన్నబోయింది. అంధులైనా చదరంగంలో రాణిస్తున్నారు. అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌లో రాష్ట్రానికి చెందిన అంధ క్రీడాకారులు టాప్-10లో ఉండటం విశేషం. సాధారణ రైతు కుటుంబం ఒకరిది. కూలీ పనితో జీవనం సాగిస్తూ పిల్లలను పోషించుకునే కుటుంబం మరొకరిది. చదరంగం పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ఫిడే రేటింగ్‌లో 1580, 1563, 1558, 1524 సాధించిన అంధ చెస్ క్రీడాకారులు నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలో అత్యుత్తమ పతకాలు సాధించారు. ఒక పక్క ఉద్యోగం చేసుకుంటూ మరోపక్క చదరంగం సాధన చేస్తూ అద్వితీయమైన ప్రతిభతో యువతకు ఆదర్శంగా నిలిచారు. శిక్షణఇస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి సిద్ధంగా ఉన్నామంటున్నారు. వీరంతా రాష్ట్ర, సౌత్‌జోన్, జాతీయస్థాయిలో పాల్గొని తమదైన ప్రతిభ కనబరుస్తూ దూసు కుపోతున్నారు. సామాన్యులతో పోటీపడుతూ చదరంగంలో సత్తా చాటడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్న ఫిడే రేటింగ్ అంధక్రీడాకారులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

టెక్నిక్‌లు తెలియకున్నా జాతీయస్థాయికి..



చెస్‌లో శిక్షణలేక ఇబ్బందులుపడుతున్నాం. జాతీయస్థాయి పోటీల్లో సరైన సమయంలో ప్రత్యర్థిని చిత్తుచేసే టెక్నిక్‌లు తెలియక జాతీయస్థాయికే పరిమితమవుతున్నాం. విశాఖపట్టణం జీవీఎన్‌సీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నా. 2004నుంచి చెస్ ఆడుతున్నా. 2018లో కేరళ, 2017లో చెన్నైలో సౌత్‌జోన్ చెస్‌పోటీల్లో పాల్గొన్నా. ఇద్దరు టాప్ ఫిడేరేటింగ్ క్రీడాకారులపై గెలిచా. శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయియిలో రాణిస్తా.

- కల్లా మురళి, విశాఖపట్టణం

వరల్డ్ చాంపియన్ గుకేశ్‌లా ఆడాలనుంది



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు నారాయణమ్మ, మునెప్ప. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాం. కుప్పం నియోజకవర్గం బిజిగానిపల్లె మా స్వగ్రామం. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో ఎంఏ తెలుగు పూర్తిచేశా. తిరుపతిలో కెనెరాబ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నా. 2016నుంచి చెస్ ఆడుతున్నా. ఆరుసార్లు రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనగా మూడుసార్లు చాంపియన్‌గా నిలిచా. 2017చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ చెస్‌పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయికి ఎంపికైనప్పటికీ ఆఫీస్‌లో సెలవు దొరక్క వెళ్లలేకపోయాను. ప్రస్తుత వరల్డ్ చాంపియన్ గుకేశ్‌లాగా ఆడాలని ఉంది.

- రఘురామ్ (1563), బిజిగానిపల్లి, కుప్పం

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



తల్లిదండ్రులు సీత, వెంకటేశ్వర్లు. పొలం పనులు చేసుకుంటూ మమ్మల్ని చదివిస్తున్నారు. చిన్నప్పటినుంచి చెస్‌క్రీడపై ఆసక్తి. శివకోటేశ్వరరావు శిక్షణలో 2012లో టోర్నమెంట్‌లో పాల్గొన్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురంలో ద్వితీయ స్థానం. గుంటూరులో మూడో స్థానం. నరసరావుపేటలో పదోస్థానం, నంద్యాలలో 5వ స్థానం సాధించా. 2023లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నా.

● ప్రసన్నకుమార్ (1558), ఈపూరి, పల్నాడుజిల్లా

అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనుంది



చదరంగం క్రీడలో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆడాలనుంది. తల్లిదండ్రులు ప్రమీల, చెన్నకృష్ణారెడ్డి నన్ను ప్రోత్సహిస్తున్నారు. నాన్న లైన్‌మన్‌గా రిటైరయ్యారు. 2020లో ఆర్డీవో కార్యాలయంలో నాకు టైపిస్ట్ ఉద్యోగం వచ్చింది. 2023లో ఎల్ఐసీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగం రావడంతో టైపిస్ట్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎల్ఐసీలో కొనసాగుతున్నా. 2017నుంచి చెస్‌ఆడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు, నరసరావుపేట, ఏలూరులో పాల్గొన్నా. 2018లో అనంతపురంలో జరిగిన సౌత్‌జోన్ పోటీలో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికయ్యా. 2018లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయిలో పాల్గొన్నా.

- మనోరంజన్‌రెడ్డి (1524), కడప



అంధుల కోసం ప్రత్యేక చెస్ బోర్డు

చదివిన బడి రుణం తీర్చుకోవాలి

● ప్రస్తుతం విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు

● కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

● నందికొట్కూరులో ఐటీఐ, పాలిటెక్నికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ప్రభుత్వ పాఠశాల మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మన ఎదుగుదలకు కారణమైన పాఠశాల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. తాను చదువుకున్న పట్టణంలోని సుబ్బారావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నారు. అప్పట్లో విద్యార్థులకు ఫిజకల్ యాక్టివిటీకి దూరమయ్యారని అన్నారు. అనంతరం పాఠశాల విమరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రహరీ, పైకప్పు, పెయింటింగ్, మినరల్ వాటర్ ప్లాంట్ పనులకు రూ.13లక్షలు డిస్ట్రిక్ట్ జనరల్ ఫండ్ నుంచి కేటాయించారు.

త్వరలోనే సెంట్రల్ లైటింగ్ పనులకు శ్రీకారం

పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి జమ్మిచెట్టు వరకు సెంట్రల్ లైటింగ్ పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. నందికొట్కూరు డిగ్రీ కళాశాలలో ఐటీఐ, పాల్‌టెక్నికల్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్ రంజిత్‌బాషను కోరారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మిత్రుడికి సన్మానాలు

తమతో పాటు చదువుకున్న కలెక్టర్ అయిన రంజిత్‌బాషా నందికొట్కూరుకు వస్తుండడంతో ఆయన మిత్రులు పాఠశాల వద్దకు తరలివచ్చారు. ఆయనను శాలువాలు, దండలతో సన్మానించారు.

కొవ్వొత్తులతో వైద్య విద్యార్థుల నివాళి



మృతి చెందిన మెడికోలకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జూడాలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన బీజే వైద్యకళాశాల మెడికోలకు కర్నూలు మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ఏపీ జూడా సంఘం వర్కింగ్ ప్రెసిడెంటు డా. సీబీ సహస్, వైస్ ప్రెసిడెంట్ డా. వీఎం హరి మాట్లాడుతూ అహ్మదాబాద్ బీజే మెడికల్ కాలేజీ హాస్పిటల్ భవనంలోకి విమానం దూసుకెళ్లిన ప్రమాదంలో ఐదుగురు మెడికోలు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏజీ జూడో సంఘం నాయకులు డా.హరూ న్ రషీద్, డా.కుమార్ రాజా, అడ్వైజరీ కమిటీ సభ్యులు డా.అనంత్ నాగ్, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వెలుగోడులో కనువిందు చేస్తున్న ఇంద్రధనస్సు

వెలుగోడులో వరదగూడు

వెలుగోడు జూన్ 15 (ఆంధ్రజ్యోతి); వెలుగోడులో అదివారం సాయంకాలం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ సమయంలో ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. వాన కురిసి వెలిసిన చల్లని వేళ హరివిల్లు అలరించింది. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

చిరుతల కలకలం

(5వ పేజీ తరువాయి)



కోసిగిలోని ఎర్రవంకలో సంచరిస్తున్న చిరుత

అనంతరం వారి సూచనల మేరకు తిరుపతి జూపార్క్‌లో గానీ, శ్రీశైలం నల్లమల అడవిలో గానీ వదులుతామని అటవీ అధికారులు చెప్పారు.

బసవన్న కొండపై మరో చిరుత



చిరుతని వల వేసి బంధిస్తున్న యువకులు

అలాగే మరో చిరుత బసవన్నకొండపై కూర్చుని చాలా సేపు తర్వాత కొండపైనే అటూ ఇటు తిరుగుతూ కొండలోకి వెళ్లిపోయింది. గత ఐదేళ్ల నుంచి కోసిగిలోని తిమ్మప్పకొండ, బసవన్న కొండ, రంగప్పగట్టులో చిరుత పులులు స్థావరం ఏర్పాటు చేసుకుని ప్రతి ఏటా చిరుతల సంఖ్య కోసిగిలో ఎక్కువ కావడంతో రైతులు, గొర్రెల కాపరులు పశువుల యజమానులు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా కోసిగి కొండల్లోని ఉన్న చిరుతలను ఫారెస్టు అధికారులు బంధించి అడవిలోని ఇతర ప్రాంతాలకు తరలించాలని కోసిగి ప్రజలు కోరుతున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సి. నారాయణరెడ్డి

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



సినారె వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సి. నారాయణరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచిపోతారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జ్ఞానపీఠం పురస్కార గ్రహీత, సినీ పాటల రచయిత డాక్టర్ సి. నారాయణ రెడ్డి 8వ వర్ధంతి సభ, సినారె పాటలపై సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తెలుగుచలన చిత్ర రంగంలో ఎన్నో మరపురాని పాటలు రాసిన సినారె ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో డాక్టర్ సినారె రాసిన పాటలను గాయకులు మహమ్మద్ మియా, కె. బాలవెంకటేశ్వర్లు, సుధారాణి, శ్రీనివాసులు, హబీబ్ ఆలపించారు.

పొలం విషయంలో ఘర్షణ

సి.బెళగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన బార్కె నారాయణ కుమారులు రాముడు, రాజేష్‌లు గత మూడేళ్ల నుంచి పొలం విషయంతో తరచూ ఘర్షణ పడేవారు. ఆదివారం రాజేష్ అన్నదమ్ములు ఇద్దరు ఘర్షణ పడ్డారు ఘర్షణలో రాజేష్.. రాముడు చెవిని కొరికాడు. అతడి చెవి పూర్తిగా తెగిపడింది. వీరు గొడవ పడుతుండగా స్థానికులు వచ్చి సర్ది చెప్పారు. రాముడు అన్న రాజేష్‌పై ఫిర్యాదు చేశాడు. ఈమేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గోనెగండ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని పెద్దనేలటూరు గ్రామం వద్ద చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని గంజిహళ్లికి చెందిన ప్రేమ్‌కుమార్(25) పత్తి పొలాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పత్తి పొలంలో కూలీ పని కుదుర్చుకునేందుకు పొలం యజమానిని కలిసేందుకు స్నేహితుడు మోహన్‌తో కలిసి శనివారం రాత్రి బైక్‌పై పెద్దనేలటూరు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. పెద్దనేలటూరు శివారు దాటగానే మలుపు దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడిపోయింది. ప్రేమ్‌కుమార్ తల రోడ్డు పక్కనే ఉన్న బండరాయికి తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. మోహన్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రేమ్‌కుమార్‌ను చికిత్స నిమి త్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

చరిత్ర ఆనవాళ్లకు చెదలు

● కేతవరం గుహల్లో

మసిబారుతున్న చిత్రలేఖనాలు

ఓర్వకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం గ్రామ సమీపంలోని గుహల్లో చరిత్ర ఆనవాళ్లకు చెదలు పట్టాయి. ఆదిమానవుడు సంచరించిన ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అక్కడి గుహల్లో కొండరాళ్లకు ముద్రించిన లిపి ఉంది. క్రీ.పూ.10వేల సంవత్సరాల నాటి క్రితం నాటివని చరిత్రకారుల అంచనా. ఈ ప్రాంతంలోని చారిత్రాత్మకమైన గుర్తులను కాపాడాల్సిన పురావస్తుశాఖ, పర్యాటక శాఖ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారిందని ఆరోపణలున్నాయి.

ఈ గుహల ప్రాంతంలో..

ఈ గుహల ప్రాంతంలో గతంలో నాటుసారా కాసేవారు. దీంతో ఆ పొగకు గోడలు మసిబారి చరిత్ర ఆనవాళ్లు దెబ్బతింటున్నాయని, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ వారసత్వ సంపదను కాపాడేందుకు నిధులు కేటాయించింది. దాదాపు రూ.50లక్షలు కేటాయించి కేతవరం చిత్రలేఖనకు రక్షణగా కంచెను ఏర్పాటుచేశారు. అక్కడికి వచ్చే పర్యాటకుల కోసం బోరును వేయించారు. అక్కడ ఆదిమానవులు వేసిన చిత్ర లేఖనాలు దాదాపు 42 దాకా ఉన్నాయి. ఇందులో జింక, ఎద్దు, కుందేలు, గుర్రాలు, మనిషి, దుప్పి లాంటి జంతువులతో పాటు వారు వినియోగించిన రాతి పనిముట్లను ఎర్రటి రంగుతో గోడలపై వేశారు. ఈ గుహలను చిన్న, చితారి గుండ్లు, పెద్ది చితారి గుండ్లు, మేకలొల్లగుండ్లు, చిన్న ఏనుగు, గని, పెద్దఏనుగు గని అని పిలు స్తుంటారు. వీటి రక్షణ కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించి స్థానిక యువకులను వాచ్‌మెన్‌గా పెట్టారు. దీంతో అక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేవి.

వైసీపీ హయాంలో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ వాచ్‌మెన్‌కు జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఉద్యోగాలు వదిలేశారు. ఆ ప్రాంతంలో కాపలా లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. కొంతమంది యువకులు అసాంఘిక కార్యకలాపాలు చేస్తుండటంతో అటువైపు పర్యాటకులు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. విలువైన అతి పురాతనమైన చరిత్రను కాపాడడానికి రక్షణ వాచ్‌మెన్‌ను నియమించాలి. ఈ గుహల సమీపంలోనే ఎయిర్‌పోర్టు రావడం, జాతీయ రహదారి కూడా దగ్గరగా ఉండటంతో పర్యాటకుల సంఖ్య పెరిగింది. ఆదిమానవుడు సంచరించిన గుహలను రక్షించాల్సిన పురావస్తు శాఖ, పర్యాటకశాఖ అభివృద్ధి చేయాల్సి ఉంది.



నిరుపయోగంగా మారిన గెస్టు హౌస్, కంప చెట్లలో పిల్లల ఆట వస్తువులు, గెస్టు హౌస్‌లో మందుబాబులు పడేసిన మద్యం సీసాలు



కేతవరం ఆది మానవుల కొండలో పెరిగిన కంప చెట్లు

వీరు ఏమాత్రం స్పందించడం లేదు. అయితే ఆ పరిసర ప్రాంతంలో కంప చెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపో యాయి. చిన్నారులు ఆడుకునే ఆట పరికరాలు, గెస్టు హౌస్ కూడా నేలపాలయ్యాయి. ఆదిమానవుడు చిత్రీకరించిన లిపిలను చూసేందుకు పర్యాటకులు కంప చెట్లల్లో వెళ్లలేక పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిధులు కేటాయించాలి



ఈ కేతవరం కొండల్లో ఆదిమానవుడు సంచరించిన ప్రాంతం. ఈ ప్రాంత అభివృద్ధి నిధులు కూటమి ప్రభుత్వం కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతానికి పర్యాటకులు అధికంగా వస్తుంటారు. పరిసర ప్రాంతం అంతా చెట్లు ఉండటంతో తేనె టీగలు అధికంగా ఉన్నాయి. దీంతో ఇక్కడి రాలేక కింద నుంచే పర్యాటకులు కింద నుంచే చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

● రామకృష్ణ, కేతవరం

కంపచెట్లను తొలగించాలి



ఆది మానవులు సంచరించిన ప్రాంతంలో ప్రాచీన లిపిలు ఉన్నాయి. ఆ పరిసర ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. కేతవరం నుంచి ఆదిమానవులు సంచరించిన ప్రాంతానికి రోడ్డు వేయాలి. పేరుకుపోయిన కంప చెట్లను తొలగించాలి.

● శ్రీధర్, కేతవరం

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కర్నూలు న్యూసిటీ/ హాస్పిటల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో 104సర్వీస్‌ను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహిస్తుందన్నారు. ఈసంస్థ రెండు నెలల వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా ప్రతి నెల అన్ని జిల్లాలో 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేష్, కళ్యాణి, జోజప్ప పాల్గొన్నారు.

చెస్‌తో మెదడుకు పదును

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెస్ సాధన చేయడంతో మెదడు వేగంగా పనిచేస్తుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. ఆదివారం స్థానిక క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో ఒలింపిక్ డే వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన చెస్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. శంకర్‌శర్మ మాట్లాడుతూ చదరంగం అని పిలువబడే చెస్ క్రీడ పురాణాల కాలం నుంచి ప్రచారంలో ఉందన్నారు మిగతా క్రీడలతో పోలిస్తే చెస్ క్రీడ వ్యక్తిగత సామర్థ్యంతో రాణించే క్రీడ అని వివరించారు. కార్యక్రమంలో నాయక్, రేణుక, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల ప్రదానం

కర్నూలు కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తైక్వాండోలో శిక్షణ పొందిన క్రీడాకారులకు 17వ వార్డు టీడీపీ కార్పొరేటర్ క్లైప పద్మలతారెడ్డి బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆదివారం కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. క్లైప పద్మలతారెడ్డి మాట్లాడుతూ ఒలింపిక్ గేమ్స్‌లో గుర్తింపు పొందిన తైక్వాండో క్రీడలో శిక్షణ పొంది బాలలు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు, తైక్వాండో శిక్షకులు టి. అజయ్, టి. తేజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో కర్నూలు డిస్ట్రిక్ట్ అక్వాటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భవనాసి రమేష్ కుమారుడు ఇషాంత్ నీట్‌లో ఆలిండియా స్థాయిలో 657వ ర్యాంకు, కేటగిరిలో 414వ ర్యాంకు సాధించాడు. ఆదివారం డీఎస్‌ఏ స్టేడియంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పా టు చేశారు. విద్యార్థి ఇషాంత్‌ను స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు సర్వేశ్వర్‌గౌడు, కోశాధికారి దస్తగిరిలు అభినందించారు.

వాహనాల తనిఖీ

సి.బెళగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఎస్‌ఐ పరమేష్‌నాయక్ ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగే ముందు కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. యువకులు మద్యానికి బానిస అయి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం మండలంలోని ఇనగండ్ల, ముడుమాల, పోలకల్లు గ్రామాల్లో ఎస్‌ఐ పర్యటించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ, పోలీసులు ఉన్నారు.

సారా స్వాధీనం

ఓర్వకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడుంబాయి తండా గ్రామానికి చెందిన నాగేంద్ర నాయక్ మోటారు సైకిల్‌పై సారాను ఆదివారం తరలిస్తుండగా.. కాల్వ గ్రామ సమీపాన కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, నవీన్‌బాబు, పోలీసు సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారు. మోటారు సైకిల్‌పై తీసుకెళ్తున్న 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు పంపినట్లు వారు తెలిపారు. ఈదాడుల్లో సిబ్బంది రంగయ్య, మురహరి, రాజు, ఈరన్న, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రసాద్ మృతి తీరని లోటు



ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ప్రసాద్ ఆకస్మిక మృతి తీరనిలోటు అని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, కే.జనార్దన్, రాష్ట్ర పూర్వపు ప్రధానకార్యదర్శి హెచ్.తిమ్మన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ప్రసాద్ సంస్మరణసభ జిల్లాఅధ్యక్షుడు గోకారి అధ్యక్షతన జరిగింది. అనంతరం ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబ సభ్యులు జయచంద్ర నాధ్, దివ్యశ్రీ, శ్వేత హరిప్రసాద్, అంజనేయులు, సీనియర్ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, గోవిందనాయక్, దేవ ప్రసన్నరాజు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రైతన్న బిజీ బిజీ

● జోరందుకున్న విత్తులు

● ఎద్దులకు డిమాండ్



బైనదొడ్డి వద్ద ఉల్లి నాటుతున్న కూలీలు

కోడుమూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో రైతులు విత్తన పనుల్లో బిజీగా గడుపుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలాలు పదునెక్కాయి. దీంతో రైతులు విత్తన పనులను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఎద్దుల బాడుగకు డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా వర్షాధార పొలాల్లో అధికంగా పత్తి పంటకు మొగ్గు చూపగా వేరుశనగ, కంది, సజ్జ వంటి పంటలు కూడా సాగయ్యాయి. ఇక నీటిలభ్యత ఉన్నచోట్ల రైతులు ఉల్లి వేసుకుంటున్నారు. నీటి తడుల కింద ఉల్లి విస్తారంగా సాగు చేస్తుం డడంతో కూలీలు సైతం బిజీ అయ్యారు. గ్రామాల్లో గత 15 రోజులుగా పొలాల్లో రైతులు, కూలీల సందడి నెలకొంది. పులకుర్తి, కల్లపరి, వర్కూరు, వెంకటగిరి, గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, క్రిష్ణాపురం, ముడుమలగుర్తి, లద్దగిరి, ప్యాలకుర్తి తదితర గ్రామాల్లో పనులు జోరందుకున్నాయి. మండలంలో ఖరీఫ్ లక్ష్యం 14 వేల హెక్టార్లు ఉండగా ఇప్పటికే పత్తి 800 హెక్టార్లు, కంది 120 హెక్టార్లు, వేరుశనగ 50 హెక్టార్లు, ఉల్లి 80 హెక్టార్లు, కూరగాయలు 25 హెక్టార్లు, కొర్ర 60 హెక్టార్లు సాగైనట్లు వ్యవసాయాధికారుల గణాంకాలు తెలియజేస్తున్నాయి.

విత్తుకు అనుకూల సమయం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో భూమిలో వేడి తొలగింది. విత్తుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఏపంట అయినా సాగు చేపట్టవచ్చు. రైతన్నలు విత్తన సమయంలో దుక్కిలో డీఏపీ వేసుకుంటే మంచిది. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. దీంతో చీడపీడల నుంచి మొలకలను రక్షించుకోగలం.

● రవిప్రకాష్ గౌడ్, వ్యవసాయాధికారి, కోడుమూరు

వృద్ధులను గౌరవించాలి



మాట్లాడుతున్న క్లైప పద్మలతారెడ్డి

కర్నూలు న్యూసిటీ/ అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని 17వ వార్డు టీడీపీ కార్పొరేటర్ క్లైప పద్మలతారెడ్డి అన్నారు. ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో కాలనీలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద ప్రపంచ వృద్ధుల దౌర్జన్య నివారణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. క్లైప పద్మలతారెడ్డి మాట్లాడుతూ వృద్ధులతో అమర్యాదగా ప్రవర్తించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో సమితి ప్రధానకార్యదర్శి ఆమకల ప్రతాప్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సహదేవరెడ్డి, బి.విజయమోహన్‌రెడ్డి, మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్, సురేష్ కుమార్, జితేంద్ర, డాక్టర్ జయప్ర కాష్, పి.సువర్ణారెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ



బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌డీఎస్ సభ్యుడు సాయిప్రదీప్

కర్నూలు హాస్పిటల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో కమలాపురం స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంటు సునీల్ ఆధ్వర్యంలో ఆదివారం గర్భిణులు, బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సాయిప్రదీప్ ముఖ్యఅతిథిగా హాజరై మాటాడారు. కార్యక్రమంలో డా.జి.నాగేంద్ర, ఉమా మహేశ్వరప్ప, గణేష్, కమలాపురం పవన్, గుజరాతి వెంకటేష్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల్లో ఆరోగ్య కేంద్రాలు

● వేధిస్తున్న గదుల, బెడ్ల కొరత

● రోగులకు అందని వైద్యసేవలు

సి.బెళగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం, పోలకల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్, రోగులకు బెడ్లు, గదులు కొరతతో సరైన వైద్యసేవలు అందడం లేదు. దీంతో రోగులు ప్రైవేటు హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్నారు. మండంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా రోగులకు వైద్యం అందడం లేదని రోగులు తెలిపారు. ఉన్నతాధికా రులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పేరుకే 24 గంటలు వైద్య సేవలు అని చెప్పడమే కాని వైద్య సేవలు శూన్యం అన్నారు. ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది ఎవరు ఎప్పుడు వస్తారో తెలియదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆరోగ్య కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

శ్మశాన సమస్యను పరిష్కరించాలి

ఓర్వకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దళితుల శ్మశాన సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఓర్వకల్లు శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నాగన్న మాట్లాడుతూ బైరాపురం, మీదివేముల, పాలకొల్లు గ్రామాల్లో శ్మశాన వాటికల్లో బండ ఉండటంతో మృతదేహాలను పూడ్చేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ గ్రామాల్లో మట్టిని తవ్వించాలని కోరారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో శ్మశాన వాటికలో కంపచెట్లు పెరిగాయని, వాటిని తొలగించి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్ది లేటి, కృష్ణుడు, అన్నయ్య, చిన్న మాదన్న పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేయండి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు సైక్లింగ్ చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, రేడియాలజిస్టు డాక్టర్ రవీంద్రరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో స్థానిక అవుట్‌డోర్ స్టేడియం నుంచి నిర్వహించిన ఫిట్ ఇండియా సైక్లింగ్ సండే ర్యాలీని ఇన్‌చార్జి చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖేలో ఇండియా ఆధ్వర్యంలో 26 వారాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్ కార్యక్రమం నిర్వ హించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ సం ఘం కార్యదర్శి డా.రుద్రరెడ్డి, శిక్షకుడు జతిన్, సైక్లింగ్ కోఆర్డినేటర్ కార్తికేయన్ పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్టేడియంలో కరాటే, సీలంబం పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్ ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో గత 15 సంవత్సరాల నుంచి ఒలింపిక్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వహణ కార్యదర్శి ఆరీఫ్ హుశేన్, మాస్టర్స్ చంద్రశేఖర్, రమణ గయాజుద్దీన్, షకీల్ అహ్మద్, మున్నాఫ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ కోరారు. ఆదివారం కేకే భవన్‌లో జరిగిన కల్లూరు మండల ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వం ఓనర్ కమ్ డ్రైవర్లందరికీ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేలు ఇచ్చిందన్నారు. అయితే కూటమి ప్రభు త్వం అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ప్రభు త్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన దీని గురించి ఊసే లేదన్నారు. అనంతరం కల్లూరు మండల యూనియన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. సమావేశంలో కల్లూరు మండల యూనియన్ అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, శ్రీరాములు, నాగార్జునుడు, మురళి, ఈశ్వర్ పాల్గొన్నారు.

● భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, కార్యదర్శి మారెళ్ల విజయ రామాంజనేయులు కోరారు. నగరంలోని రెండో వార్డులో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అబ్దుల్‌దేశాయ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కార్మికులు తీరని ద్రోహం చేసిందన్నారు. ఐదు సంవత్సరాలు ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిందని, ప్రస్తుతం ఆ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాజా పాషా, మాజీ కార్యదర్శి ఎస్‌ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

కర్నూలు న్యూసిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సచివాలయంలో హెల్త్ అసిస్టెం టుగా పని చేస్తూ ఎంపీహెచ్‌పీ(ఎఫ్)ల పదోన్నతి పొందిన ఉద్యోగులకు యూనియన్ నాయకులు సంధారాణి అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా పదోన్నతి లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సబబుకాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి ఎండీ అంజి బాబు, శ్రామిక మహిళా కన్వీనర్ పి.నిర్మల, నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు ఏసురత్నం, మహేశ్వరి, వెంకటేశ్వరమ్మ, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



ఆర్థిక సాయం అందజేస్తున్న నరేంద్ర

కర్నూలు కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాల 1997-98వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం నగరంలోని చిత్తారి వీధిలో ఉన్న విద్యార్థి సాయిరమణకు పైచదువుల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న జాకీర్ హుశేన్ అనే పదో తరగతి విద్యార్థికి రూ.11,500 విలువ చేసే టెస్టు బుక్స్, నోటు బుక్స్, స్టేషనరీ ఇతర ఖర్చుల నిమిత్తం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి చిత్రాల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ తాము మా పాఠశాల పూర్వ విద్యార్థుల తరఫున ప్రతి ఏడాది అనాథ ఆశ్రమాలకు, వృద్ధులకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రాంతి, రాము, రఫీ, బాషా, రజినీకాంత్, ప్రదీప్, రవి, శివ, అనిల్, గంగాధర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

● వజ్రోత్సవంలో పూర్వ విద్యార్థులు



వజ్రోత్సవం సందర్భంగా కలుసుకున్న సెయింట్ మేరీస్ పాఠశాల పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ మేరీస్ పాఠశాల పూర్వ విద్యార్థులు వజ్రోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సమ్మేళనం అలనాటి వారి జ్ఞాపకాలకు అపూర్వ వేదికగా మారింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ఉస్మానియా కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్ మాట్లాడుతూ నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలోగల సెయింట్ మేరీస్ పాఠశాల 86ఏళ్లుగా ఎందరో మేధావులను అందించిన ఘనత విద్యాసంస్థ అని కొనియాడారు. దివంగత ఉపాధ్యాయులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటిం చారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి చెన్నై, హైదరాబాదు, విజ యవాడ తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా రషీద్ ఖాన్, విల్సన్ సుధాకర్, వెంకట రమణ వ్యవహరించారు. స్కందకుమార్, డాక్టర్ నాగసేన, రంగారెడ్డి, సలీమ్ అహ్మద్, గోపాలకృష్ణ, విక్టర్, ఈశ్వరయ్య, వెంకటరమణ, గురురాజాచారి, విజయభాస్కర్ రెడ్డి, ప్రసాద్, మల్లికార్జున , నాగేశ్వరరావు, కరుణాకర్ రెడ్డి, అమృత్‌కుమార్, పండిట్ కిరణ్, ఇక్బాల్, చంద్రుడు, నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని అబ్బాస్ నగర్ ఆదర్శ విద్యాపీఠం పాఠశాల 1999-2000 పూర్వ విద్యార్థులు ఆదివారం వీవీఎస్ ఫంక్షన్‌హాలులో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాఠశాల కరస్పాండెంట్, వావిలాల కృష్ణమూర్తి, హెచ్‌ఎం రామాంజనేయులు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన తలారి కృష్ణ మాట్లాడుతూ ఆదర్శ విద్యాపీఠంలో చదివి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాల అధ్యాపకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దుర్గారావు, ప్రమీల పాల్గొన్నారు.

అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు

● బనవాసి పశుక్షేత్రం ప్రాంతం నుంచి అక్రమ రవాణా
● రాత్రికి రాత్రే తవ్వి తరలించి సొమ్ముచేసుకుంటున్న వైనం
● చోద్యం చూస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రాంతంలోని బనవాసి పశుక్షేత్రం అటవీ ప్రాంతంలో ఎర్రమట్టి, ఎర్రగరుసు కొంతమంది అక్రమార్కులకు వరంగా మారింది. రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఎమ్మిగనూరు పట్టణానికి తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప అడ్డుకోవటంలో ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎర్రమట్టి, ఎర్రగరుసు అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

● రాత్రికి రాత్రే తవ్వకాలు.. తరలింపు:

బనవాసి అటవీ క్షేత్రం, పశుక్షేత్రం భూముల్లో కొంతమంది అక్రమార్కులు రాత్రి పొద్దుపోయిన తరువాత ఎర్రమట్టి, ఎర్రగరుసు అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. క్షేత్రానికి సమీపంలోని గ్రామానికి చెందిన కొందరు గత కొన్ని రోజుల క్రితం అర్ధరాత్రి ఏకంగా ఎక్స్‌కవేటర్‌ను వెటర్నరీ కళాశాల వెనుక ఉన్న భూముల్లోకి పంపి ఎర్రమట్టిని, ఎర్రగరుసును ట్రాక్టర్లతో ఎమ్మిగనూరు పట్టణానికి తరలించి సొమ్ము చేసుకున్నారు. రాత్రి వేళల్లో కాపలా ఉండక పోవటంతో అక్రమ



ఎర్రగరుసు తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గుంత



ఎక్స్‌కావేటర్‌తో ఎర్రమట్టిని తవ్విన ప్రాంతం

తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెండు చోట్ల దాదాపు 30నుంచి 50 ట్రాక్టర్ల వరకు ఎర్రగరుసు, ఎర్రమట్టిని తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రాక్టర్ దాదాపు రూ. 2000 నుంచి 2500 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేగాక బనవాసి అటవీ క్షేత్రంలోని ప్రాంతాల్లో కూడా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. నవోదయ విద్యాలయం సమీపం నుంచి మొదలుకొని ఏపీ ఆర్‌జెసీ కళాశాల వెనుక వరకు అక్రమ తవ్వకాలతో పెద్దపెద్ద గంతలు ఏర్పడ్డాయి. అలాగే నవోదయ ఎదురుగా ఉన్న టేకు వనం, ఎల్లెల్సీ కాలువను ఆనుకొని ఎర్రమట్టి అక్రమ తవ్వకాలతో పెద్ద గుంతలు కనిపిస్తున్నాయి. దీంతో కాలువ గట్టు ప్రమాదకరంగా మారాయి. అంతేగాక వివిధ రకాల మొక్కలు కూడా మోడు బారిపోతున్నాయి. ఇదిలాగే కొనసాగితే అటవీ, పశుక్షేత్రాల ఉనికికే ప్రమాదంగా మారే అవకాశం ఉంది ఇక్కడే కాక మండల పరిధిలోని మాసుమాన్ దొడ్డి, గుడికల్, పెద్ద కడుబూరు మండలం హనుమాపురం, రాగిమాన్ దొడ్డి గ్రామాల సమీపంలో ఉన్న కొండలు, తిప్పలనుంచి అక్రమంగా గరుసును తవ్వి తరలిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు.

● తూతూ మంత్రంగా పర్యవేక్షణ:

బనవాసి అటవీ, పశుక్షేత్రాలతో పాటు గుడికల్లు, మాసుమాన్ దొడ్డి, పరమాన్ దొడ్డి, రాగిమాన్ దొడ్డి గ్రామాల పరిధిలో ఉన్న భూములు, కొండలు, గుట్టల్లో సమీప గ్రామాలతో పాటు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కొంత మంది అక్రమార్కులు యథేచ్ఛగా ఎర్రగరుసు, ఎర్రమట్టి తవ్వి తరలిస్తున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న హనుమాపురం కొండల్లో కూడా ఇదే పరిస్థితి. దీంతో కొండపై రాళ్ల మధ్యలో కనిపించాల్సిన గరుసు కనిపించకుండా పోయింది. అలాగే మిగతా ప్రాంతాల్లో అక్రమార్కులు రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన యంత్రాంగం తూతూ మంత్రంగా పర్యవేక్షణ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఎర్రమట్టి, ఎర్రగరుసు అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం..

మా దృష్టికి వచ్చిన ఫిర్యాదులు పరిష్కరిస్తున్నాం.. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులు ఎవరైనా వదిలిపెట్టం. సమాచారం తెలిస్తే ఫిర్యాదు చేయాలని ప్రజలకు, స్థానికులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

చంద్రశేఖర్, డీడీ, ఘనీకృత వీర్య అబోతు కేంద్రం

మంత్రాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం ఆర్టీసీ బస్టాండును అద్భుతంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. మంత్రాలయం నుంచి పంచముఖి, తుంగభద్ర రైల్వేస్టేషన్, రాయచూరు, ఉరుకుంద, మాధవరం, పెద్దతుంబళం మీదుగా ఆదోని, బెంగుళూరు, తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు కొత్త సర్వీసులు ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. మంత్రాలయంలో ఏయే వస్తువులు అమ్మకానికి దుకాణాలు అద్దెకు తీసుకున్నారో వాటినే అమ్మాలని సబ్ లీజుకు ఇస్తే టెండరు రద్దు చేస్తామని హెచ్చరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుకు ఆర్‌ఎంకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భక్తులకు ఫ్యాన్లు, కుర్చీలు, సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి మంత్రాలయాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం మంత్రాలయం బస్టాండు అభివృద్ధికి రూ.38 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. సమావేశంలో ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ ఎల్లప్ప, శశిధర్, బీవీ రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి చంద్రబాబు దేవుడయ్యాడు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారిగా నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు దేవుడయ్యాడని టీడీపీ మండల కమిటీ కన్వీనర్ డీవీ రాముడు, క్లస్టర్ కాశీంవలీ అన్నారు. చంద్రబాబు తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు విద్యార్థుల తల్లుల ఖాతాలోకి వేసి వారింటికి పెద్ద దిక్కుగా నిలిచారన్నారు. ఒకే ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం పథకం లబ్ధి చేకురడంతో వారింట్లో ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయన్నారు. చంద్రబాబు విజన్ గల వ్యక్తి అని, ప్రజలకు ఉపయోగపడే సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టాడన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సత్యారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగలదిన్నె వహబ్, జనసేన నాయకులు యల్లప్ప పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పని సరి

గోనెగండ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవం పథకం కింద రైతులు లబ్ధి పొందాలంటే ప్రతి రైతు తప్పని సరిగా ఈకేవైసీ చేసుకుంటేనే అర్హులు అవుతారని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. పథకానికి అర్హత పొందాలంటే సమీపంలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోను సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన సూచిస్తారు. ఓటీపీ ద్వారా నమోదు చేసుకునే అవకాశం లేదని, రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

అన్యాయం జరిగితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చెట్నహల్లి గ్రామంలో దళితుల ఇళ్ల ముందు ఉన్న శ్మశాన స్థలంలో కంచె ఏర్పాటు చేసి మాదిగలకు అన్యాయం చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గర్జి హనుమన్న అన్నారు. ఆదివారం మంత్రాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సర్వే.నెంబర్.113, 114లో 2.80 ఎకరాల్లో ఒక ఎకరా ఇళ్ల ముందున్న రస్తా పోరంబోగు భూమిని దళితులు గడ్డివాములు, ఇళ్లు కట్టుకుని జీవనం సాగిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రత్నం, యోహాన్, అనిల్ కుమార్, మారెన్న, నాగేంద్ర, డేవిడ్, నరసింహులు పాల్గొన్నారు.

29 మందిపై కేసు నమోదు

మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో శ్మశాన స్థల వివాదంలో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన కంచెను, కంచెలోని మూడు స్థంభాలను ధ్వంసం చేయడంపై ఒక వర్గానికి చెందిన 29 మందిపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు



స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తుల మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ స్వర్ణ పల్లకి విహరిస్తున్న దృశ్యం భక్తులను ఆకట్టుకుంది.

బైక్ చోరీ, కేసు నమోదు

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని కళ్యాణకట్ట వద్ద పార్కింగ్ చేసిన మంగళి భీమేష్ చెందిన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. బైక్ కనిపించకపోవడంతో ఆదివారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బైక్ ఆచూకి కోసం సీసీ కెమెరాలను పరిశీలించారు. అపహరణకు గురైన బైక్‌ను త్వరలోనే గుర్తించి బాధితునికి అప్పగిస్తామని ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు.

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషికి స్వాగతం పలికేందుకు మంత్రాలయం వచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి పద్మనాభతీర్థ గెస్టు హౌస్ వద్ద టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పైబావి అమర్నాథ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు, ఎస్‌ఈ ఉమాపతి, విజయుడు, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ నాగరాజు, ఏఈ విజయ నరేష్, ట్రాన్స్‌కో డీఈ పురుషోత్తం ఏఈ గోవిందు, తహసీల్దార్ రవి, ఆర్‌ఐ జనార్దన్‌రావు, పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. మొదటిసారిగా ఆయన మంత్రాలయం రావడంతో ఘనంగా స్వాగతం పలికారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో రైతులకు పూర్తి స్థాయిలో సబ్సిడీ విత్తనాలు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఎరువులు, సబ్సిడీ విత్తనాలు, పురుగు మందులు ఇవ్వడం లేదని దీంతో ప్రైవేటు దుకాణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఖరీఫ్ మొదలైందని, వర్షాలు పడుతుండటం వల్ల రైతులు కల్తీ విత్తనాలు, ఎరువులు, లైసెన్సు లేని దుకాణాల వద్ద కొనుగోలు చేసి మోసపోతున్నారని అన్నారు. అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు రైతులకు ప్రభుత్వమే అందజేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, వెంకటేష్ నాయక్, బదినప్ప నాయక్, ఈరన్న నాయక్, ఓంకార్ నాయక్, రాముడు, సురేష్, శేఖర్, ఉచ్చన్న పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తాం



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈవో తులసిదేవి

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమాన్‌దొడ్డి తాండాను జిల్లాలో జ్వూ గా ప్రోగ్రాం కింద ఎంపికైన సందర్భంగా 17 శాఖల అధికారులతో ఎస్సీ కార్పొరేషన్ ఈవో తులసిదేవి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 15 నుంచి 30 వరకు గిరిజనులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు 17 శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. 107 గృహాలు ఉన్నాయని, 627 మంది జనాభా ఉండటంతో పక్కాగృహాలు, ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు, ఎలక్ట్రిసిటీ, సీసీరోడ్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కిసాన్ కార్డులు, అనీమియా ట్రస్టులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇంటింటికి తిరిగి గిరిజనులకు అవసరమైన ఏర్పాట్లను తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జ్వూ ప్రోగ్రాంకు మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తాండా ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నూర్జహాన్, ఏవో జీర గణేష్, డా.సురేష్, ఏపీవో రాజశేఖర్, ఏపీఎం భక్త వత్సల్య, సూపర్‌వైజర్ సునీత, ఎంఈవో రాగన్న, అపర్ణ, వీఆర్వో నగేష్, సునీత, వీరేష్, ప్రమీల పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్థులకు 'చెస్ట్ ఎక్స్‌రే' ఉచితం



ఎక్స్‌రే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కోసిగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో మంచి పని చేస్తున్నారని వేల రూపాయలు ఖర్చు చేసే టీబీ ఎక్స్‌రే వైద్య పరీక్షలను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా చేస్తుండటంతో వ్యాధిగ్రస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోసిగిలోని ప్రభుత్వ వైద్యశాలలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని టీబీ బాధితులకు ఉచితంగా ఎక్స్‌రే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో డా.రాజ్‌కిరీటీ ఆధ్వర్యంలో టీబీ సూపర్‌వైజర్స్ స్వరూప్ భాస్కర్ నేతృత్వంలో కోసిగిలోని మూడు సబ్ సెంటర్ల పరిధిలో 5 సచివాలయాలకు సంబంధించిన వంద మందికి టీబీ ఎక్స్‌రే, ఉచిత చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. డా.రాజ్‌కిరీటీ మాట్లాడుతూ మండలంలో 56 టీబీ కేసులను గుర్తించామని, ఇందులో చికిత్స పొందుతున్న వారు 26 మంది ఉన్నారని, మూడు వారాలకు మించి దగ్గు ఉంటే టీబీ కావచ్చని ప్రతి ఒక్కరూ టీబీ పరీక్షలు చేసుకుని ఉచిత మందులు పొందాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మద్యపానం, ధూమపానం చేసేవారికి టీబీ వస్తుందన్నారు. అనుమానితులు పెద్ద ఎత్తున టీబీ పరీక్షల కోసం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చారు.

చాలా మంచి పని



ప్రభుత్వం పేదల కోసం టీబీ చెస్ట్ ఎక్స్‌రే ఉచితంగా అందించడం చాలా మంచి పని. రాష్ట్ర ప్రభుత్వానికి పేదలు రుణపడి ఉంటారు. ప్రత్యేక కృతజ్ఞతలు

-ఎంకప్ప కోసిగి, గ్రామస్థుడు

ఎక్స్‌రేను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చెస్ట్ ఎక్స్‌రే కార్యక్రమాన్ని అందిస్తుందని మండలంలో టీబీ వ్యాధి అనుమానితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

- డా.రాజ్ కిరీటీ

జాడలేని బీసీ సబ్సిడీ రుణాలు

● ఆందోళన వ్యక్తం చేస్తున్న ధరఖాస్తుదారులు
● రుణాల కోసం తప్పని ఎదురు చూపులు

గోనెగండ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు గాను ప్రభుత్వం సబ్సిడీ కింద బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను మంజూరు చేసింది. అయితే రుణాల మంజూరు విషయంలో రాజకీయ నాయకుల జోక్యం పెరగడం, అధికారులు నాయకులు మధ్య సమన్వయ లోపం కారణంగా రుణాల మంజూరు విషయంలో జాప్యమైందనే ప్రచారం జరుగుతోంది. అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి నాలుగైదు మాసాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు కార్పొరేషన్ రుణం మంజూరు అయిన లబ్ధిదారుల జాబితా కూడా తయారు కాలేదు. దీంతో రుణాలు అందుతాయా లేదా అనే సందేహంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీసీ కార్పొరేషన్ కింద 50 యూనిట్లు మంజూరు:

గోనెగండ్ల మండలానికి బీసీ కార్పొరేషన్ కింద 50 యూనిట్లు మంజూరు అయ్యాయి. మండలంలో 20 గ్రామ పంచాయతీలకు ఆరు బ్యాంకులు ఉన్నాయి. ఇందులో గోనెగండ్ల ఎస్‌బీఐ పరిధిలో గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు, పెద్దమరివీడు, కులుమాల, ఐరన్‌బండ, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, గాజులదిన్నె, పంచాయతీలకు 19 యూనిట్లు, వర్కూర్ కెనరా బ్యాంక్ పరిధిలో లింగందిన్నె, ఎర్రబాడు, కున్నూరు, పంచాయతీలకు ఐదు యూనిట్లు, పెద్దనేలటూరు కెనరాబ్యాంక్ పరిధిలో పెద్దనేలటూరు, చిన్ననేలటూరుకు ఏడు యూనిట్లు, హెచ్ కైరవాడి కెనరా బ్యాంక్ పరిధిలో హెచ్ కైరవాడి, పుట్లపాశం, గ్రామాలకు తొమ్మిది యూనిట్లు, వేముగోడు యాక్సిస్ బ్యాంక్ పరిధిలో వేముగోడు, తిప్పనూరు, గ్రామాలకు రెండు యూనిట్లు, తెర్నెకల్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం, పంచాయతీలకు ఎనిమిది యూనిట్లు కేటాయించారు.



దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

596 మంది నిరుద్యోగులు దరఖాస్తు:

50 యూనిట్లకు గాను 596 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. నెలలు గడుస్తున్నప్పటికీ యూనిట్లు మంజూరు కాక పోవడంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో దరఖాస్తుకు ఆన్‌లైన్ ఖర్చు మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటర్వ్యూ ఖర్చు రూ. 500 దాక అయిందని నిరుద్యోగులు తెలుపుతున్నారు. నాయకులు అండదండలు ఉన్నవారికి మాత్రమే రుణాలు మంజూరు చేయాలని అధికార పార్టీ నాయకులు మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో ఈ ప్రక్రియ ఆగిపోయిందని మరి కొందరు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

నిరాశతో నిరుద్యోగులు:

బీసీ కార్పోరేషన్ కింద సబ్సిడీ రుణాలు మంజూరు అయితే ఏదో చిన్న వ్యాపారం పెట్టుకొని జీవించవచ్చని ఆశిస్తున్న నిరుద్యోగులకు అధికారులు, రాజకీయ నాయకుల తీరు నిరాశను మిగిలిస్తుంది. ఎప్పుడు రుణాలు మంజూరు చేస్తారా? అని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. రుణాల మంజూరు విషయంలో రాజకీయ జోక్యం పట్ల అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నివేదిక తయారు చేసి జిల్లా కేంద్రానికి పంపించాం :



రెండు మూడు నెలల క్రితమే అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించి నివేదిక తయారు చేసి బ్యాంకు అధికారులకు, జిల్లా అధికారులకు నివేదిక పంపించాం. అక్కడ నుంచి మంజూరు అయిన వారి జాబితా వస్తే వెంటనే ఎంపిక చేసిన వారికి రుణాలు మంజూరు చేసే ప్రక్రియ చేపడతాం.

- మణిమంజరి, ఎంపీడీవో, గోనెగండ్ల

గుప్త నిధుల కలకలం

పెద్దకడుబూరు, జూన్15(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరు మండలంలోని మురవణి గ్రామంలో గుప్త నిధులు తవ్వకాలు కలకలం రేపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామ సర్పంచ్ జానికమ్మ తండ్రి, గ్రామ వైసీపీ నాయకుడు దేవదానంతో పాటు మరో ఏడుగురుతో కలిసి ఆదివారం పట్ట పగలే స్వామిజీల ఆధ్వర్యంలో గుప్త నిధులు తవ్వకాలు ప్రారంభించారన్నారు.. ఈ ప్రాంతంలో గుప్తనిధులు కోసం తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ తవ్వకాల కోసం హైదారాబాద్, గద్వాల్, తాడేపల్లె గూడెంకు చెందిన నలుగురుతో కలిసి గ్రామ శివార్లు ఉన్న బసవన్న గుడి సమీపాన ప్రభుత్వ చెత్త సంపద కేంద్రం వద్ద గుప్త నిధుల తవ్వకాల కోసం క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారు.ఈ విషయం పై ఎస్‌ఐ నిరంజన్ రెడ్డికి సమాచారం రావడంతో తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహంచారు.ఈ దాడుల్లో కారును సీజ్ చేసి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

పొనకలదిన్న వైసీపీ గ్రామ అధ్యక్షుడుగా వీరేష్

నందవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొనకలదిన్నె వైసీపీ గ్రామ అధ్యక్షుడిగా గొల్ల వీరేష్‌ను ఆదివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుట్టా రేణుకమ్మ, బుట్టా నీలకంఠల ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. దీంతో గ్రామ సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీల సంఘం మాజీ డివిజన్ అధ్యక్షురాలు పావణి హర్షం వ్యక్తం చేశారు. గొల్ల వీరేష్‌ను ఎంపిక చేసిన బుట్టారేణుకమ్మ, మండల పార్టీ కన్వీనర్ శివారెడ్డిగౌడు, విరుపాక్షిరెడ్డిలకు అభినందనలు తెలిపారు.

బియ్యం మాయంపై దర్యాప్తు చేయాలి


నూర్ అహ్మద్

ఆదోని, జూన్15(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం మాయంపై ప్రభుత్వం దర్యాప్తు చేయించాలని మైనార్టీ హక్కుల సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ ఆదివారం డిమాండ్ చేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు 2 వేల బస్తాలకు పైగా బియ్యాన్ని పట్టుకుంటే 109 సంచులుగా అధికారులు చూపడం వెనక మర్మమేంటని ప్రశ్నించారు. మిగతా బియ్యాన్ని తెల్లారే మారాచరని, ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకు నేందుకు ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ మెమ్మెల్యే మీనాక్షినాయుడు చొరవ చూపాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్, మంత్రికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

- వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ



దేవనకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పనులను తెలుసుకోకుండా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి వ్యాఖ్యలు చేయడం సరికాదని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ సర్పంచ్‌లకు నిధులు లేవని, జీతాలు ఇవ్వలేదని, గ్రామాల్లో అభివృద్ధి జరగలేదనడం ఆర్థరహిత మన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలకు వచ్చే 15వ ఆర్థికసంఘం నిధులను జగన్ దారి మళ్లించలేదా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం సర్పంచ్‌లకు నిధులతో పాటు, గ్రామాలలో అభివృద్ధి పనులను పరుగులు చేస్తోందన్నారు. ఎమెల్యే అసెంబ్లీలో మాట్లాడకుండా ఆలూరులో ప్రెస్‌మీట్‌పెట్టి మాట్లాడటం తగదని హితవు పలికారు.

పెద్దలను గౌరవించాలి

- న్యాయాధికారి సుభాష్



మాట్లాడుతున్న న్యాయాధికారి

ఆదోని, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెద్దలను గౌరవించాలని అది మానవ సంబంధాల్లో భాగమని ఆదోని జుడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి లీలా సాయి సుభాష్ సూచించారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో పెద్దలతో నడుచుకునే విధానంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పెద్దల నుంచి అనుభవం, జ్ఞానం నేర్చుకోవచ్చన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వృద్ధులను గౌరవించాలని వారిని వృద్ధాశ్రమాల్లో చేర్పించకుండా, ప్రేమాభిమానాలతో చూసుకోవాలని కోరారు. జిల్లా కోర్టు నామినెట్ మెంబర్ లోకేష్‌కుమార్, ప్యానల్ మెంబర్స్ కళ్యాణ్ రెడ్డి, బాలకృష్ణ, అంజినప్ప, రామలింగ పాల్గొన్నారు.

తల్లికి వందనంతో కుటుంబాల్లో ఆనందం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం కింద రూ.13వేలు ఖాతాల్లో జమ చేయడంతో కుటుంబాల్లో ఆనందం వచ్చిందని టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆదివారం అన్నారు. మంత్రి నారా లోకేశ్‌పై మాజీ సీఎం వైఎస్ జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. రూ.2వేలు పాఠశాల అభివృద్ధికి జమ చేస్తుంటే మంత్రి ఖాతాలోకి వెళ్తాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు పత్తికొండ తాలుకాలో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. నాయకులు మెడికల్ తిమ్మప్ప, శంకర్, రామలక్ష్మి, తదితరులు ఉన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్


ఎంఈవో తిమ్మారెడ్డి

దేవనకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా నేలతల మర్రి, జిల్లెలబుడకల, మాచాపురం గ్రామాల పాఠశాలు అప్‌గ్రేడ్ అయినట్లు ఎం ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. ఈ పాఠశాలల్లో గతంలో ఎనిమిదవ తరగతి వరకు మాత్రమే ఉండేదని, అప్‌గ్రేడ్ అవడంతో ఈ ఏడాది నుంచి పదో తరగతి వరకు ఉంటుందన్నారు. అలారుదిన్నె పాఠశాల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చామని, ఈ పాఠశాలలో అయిదో తరగతి వరకు మాత్రమే ఉంటుందన్నారు.

రూ.15 వేలు ఇవ్వాలి


మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మద్దికెర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు ఇవ్వాలని వైసీపీ నాయకులు ఆర్. వెంకటేశ్వర్లు, కృష్ణాయాదవ్, వెంకట్రామిరెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం పథకంలో రూ.2వేలు కోత విధించి, రూ.13వేలు ఇవ్వడం అన్యాయమన్నారు.

20 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్


ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20 నుంచి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చాంబర్లో మాట్లాడుతూ పాలిసెట్-2025లో అర్హత సాధించిన వారు ఈనెల 20 నుంచి 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఓసీ, బీసీలు రూ.700 లు, ఎస్సీ, ఎస్టీలు రూ.250లు కౌన్సెలింగ్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదోతరగతి సర్టిఫికెట్, టీసీ, నాలుగు నుంచి పదో తరగతి స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒరిజినల్, రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలన్నారు. 25 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయని, జూలై 1న వెబ్ ఆప్షన్ మార్చుకునే అవకాశం ఉందన్నారు. జూలై 3న సీట్లను కేటాయిస్తారని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్ట్ చేసి సంబంధిత కళాశాలలో చేరాలన్నారు. వివరాలకు 9885251182, 8121555646 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ప్రసూచించారు.

ముప్పు



దేవనకొండ బస్టాండ్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేదు. ట్రాన్స్‌ఫార్మర్ భూమికి కేవలం రెండు అడుగుల ఎత్తులో ఉండటంతో ఏమాత్రం అదుపు తప్పినా వాహనదారులు, పశువులు, పాదచారుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. - దేవనకొండ

తుప్పు



మేజర్ గ్రామ పంచాయతీతో పాటు మజరా గ్రామం బొజ్జనాయునిపేటలో పారిశుధ్య పనుల కోసం గత ప్రభుత్వ హయాంలో 45 చెత్త బండ్లు మంజూరు చేశారు. వాటిని మూలకు పడేయడంతో తుప్పు పడుతున్నాయి. వీటికిచిన్న మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలోకి వస్తాయి. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాగు చేయిస్తామని తెలిపారు. - మద్దికెర

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

ఆదోని, జూన్15 (ఆంధ్రజ్యోతి): పిల్లలను బడికిపంపే తల్లికి ఏటా రూ.15 వేలు ఇవవడం హర్షణీయమని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు పేర్కొన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులు, విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఒకేరోజు రూ.10వేల కోట్లకు పైగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం దేశ చరిత్రలో రికార్డు అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎంతమంది పిల్లలుంటే అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అని మోసం చేశారని గుర్తు చేశారు. అయితే చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అందరు పిల్లలకు అమలు చేశారని కొనియాడారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. మంత్రి లోకేష్ సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించారన్నారు. రామస్వామి, శ్రీనివాస ఆచారి, సాధిక బేగం, కల్లుబావి మల్లికార్జున, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదామని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపు నిచ్చారు. మండలంలోని దుదేకొండలో సీపీఐ శాఖ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను గిడ్డయ్య ఆవిష్కరించారు. గత ఎన్నికల్లో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి, గద్దెనెక్కి ఏడాది పూర్తయినా హామీలను అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ ఉన్న ఉద్యోగులను తొలగించారన్నారు. ఖరీఫ్ ఇప్పటికే మొదలైందని నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను రైతులకు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేయాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని మరచి పాలన సాగిస్తున్న ప్రభుత్వ విధానాలను ఎండగట్టే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్య కావాలన్నారు. సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్, దుదేకొండ సీపీఐ ఎంపీటీసీ ఈరన్న, క్రారుమంచి, కారన్న, కృష్ణయ్యా, రంగన్న, గ్రామకార్యదర్శి రాముడు, అంజినేయ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా

మద్దికెర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బిర్సాముండా బ్రిటీష్ పాలను వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడని ఎస్ఐ విజయకుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ అన్నారు. ఆదివారం మద్దికెర, పెరవలి మదనంతపురం గ్రామాల్లో బిర్సాముండా జయంతి నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు డి.మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనితా యాదవ్, టీడీపీ నాయకులు ధనుంజయుడు, చంద్రశేఖర్‌గౌడు, ఎస్.లక్ష్మినారాయణ, పంచాయతీ సలహాదారులు బండారు అంజనేయులు, కార్యదర్శి పరమేశ్వరప్ప ఉన్నారు.

సార్.. ఓ సీటు ప్లీజ్

- మోడల్, కేజీబీవీ, గురుకుల సీట్ల కోసం ఎంపీ, ఎమ్మెల్యే వద్దకు తల్లిదండ్రులు
- సిఫారసు లేఖలను చూసి, తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపాళ్లు


ఆలూరు మోడల్ స్కూల్‌లో చేరేందుకు వచ్చిన విద్యార్థులు

ఆలూరు, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా, మోడల్, గురుకుల పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు వెళుతున్నారు. వారి నుంచి సిఫారసు లేఖలను తీసుకురావడంతో ప్రిన్సిపాళ్లు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక నాయకులు సైతం తమవారికి సీటు ఇవ్వాలని ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక ప్రిన్సిపాళ్లు అయోమయానికి గురవుతున్నారు.

మిగిలిన సీట్లకు ప్రవేశాలు

మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగిలి పోయిన సీట్ల భర్తీకి ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో ఖాళీగా ఉన్న 4 సీట్లలో బీసీ-ఈ, బీసీ-బీ(జనరల్), ఎస్సీ(జనరల్), ఎస్టీ(జనరల్), ఎస్సీ (ఉమెన్), 9వ తరగతిలో 3 సీట్లు ఖాళీలు ఉండగా, ఎస్టీ (జనరల్), ఎస్సీ(జనరల్), బీసీ-డీ(ఉమెన్)కి రిజర్వు అయిందన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపేస్తాం


రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ కృష్ణారెడ్డి

మద్దికెర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపేస్తామని క్వాలిటీ కంట్రోల్ ఈఈ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ శివరుద్ర కుమార్ హెచ్చరించారు. రూ.5 కోట్లతో నిర్మిస్తున్న మద్దికెర-బురుజుల రోడ్డును ఆదివారం పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు వేశామని, మద్దికెర, బురుజుల గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు. ఏఈ సునీల్, కాంట్రాక్టరు దశరథరామిరెడ్డి ఉన్నారు.

పుస్తకాలకు ఆదరణ తగ్గలేదు


రామలింగమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలకు ఆదరణ తగ్గలేదని విశ్రాంత డీఎస్పీ రంగముని, తెనాలి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల అధ్యాపకురాలు పార్వతి అన్నారు. ఆదివారం పట్టణంలోని రాధాస్వామి ఆశ్రమంలో విశ్రాంత హెచ్ఎం హత్తిబెళగల్ రామలింగమ్మ రచించిన నా జీవన పథంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమాజంలోని సంఘటనలు, నిజ జీవిత అనుభవాలను పుస్తకంగా రచించడం అభినందనీయమన్నారు. అనంతరం గద్వాల సోమన్న రచించిన శాంతికపోతం పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగులు శ్రీనివాసులు, వీరస్వామి, విజయభాస్కర్, కవి ఈశ్వరప్ప, హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు మహాదేవమ్మ, మల్లికార్జున, నర్సుబాయి, నాగజ్యోతి, భాస్కరగౌడ్ ఉన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


జొన్నగిరిలో కలిసిన పూర్వ విద్యార్థులు

తుగ్గలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి జడ్పీ ఉన్న పాఠశాల 2008-2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. 16 ఏళ్ల తర్వాత ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనాటి మధురక్షణాలను నెమరు వేసుకున్నారు.

అసంపూర్తిగా ఆసుపత్రి

చిప్పగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పగిరి గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు అసంపూర్తిగా మిగిలి పోయి. ప్రజలకు వైద్యసేవలందిం చేందుకు గత ప్రభుత్వం పనులు ప్రారంభించగా నిధుల లేమితో పూర్తికాలేదు. అలాగే దౌల్తాపురం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి. ఆసుపత్రి ఏర్పాటవుతుం దనుకున్న ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇప్పటికైనా ఆసుపత్రి భవనాలను పూర్తిచేసి, తమకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


చిప్పగిరి మండలం, గుమ్మనూరులో ఆగిపోయిన ఆసుపత్రి భవనం

విశ్వజ్యోతి జ్యోతిష్య సమ్మేళనంలో చిరుమాన్‌దొడ్డివాసి



హైదరాబాద్‌లో మల్లికార్జునస్వామిని సన్మానిస్తున్న జ్యోతిష్య పండితులు

ఆస్పరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఎం.మల్లికార్జున స్వామి ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వజ్యోతి జ్యోతిష్య సమ్మేళనంలో పాల్గొన్నారు. బహు గ్రంథ రచయిత పుచ్చా శ్రీనివాసరావు, జ్యోతిష్య విశారద గ్రంథ రచయిత పాలపర్తి శ్రీకాంత శర్మ, శతాధిక గ్రంథ సంకలనకర్త ఇంద్రకంటి వెంకటగోపాలకృష్ణ శర్మ, కంచి కామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి లక్కావజుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి వారి చేతులమీదుగా సువర్ణ కంకణం ప్రదానం చేస్తూ సన్మానం చేశారు. ఈ సన్మానంపై ఎంపీపీ సుంకర ఉమాదేవి, సర్పంచ్ సుంకర నాగమ్మ, గ్రామపెద్దలు మల్లన్న, రామాంజనేయులు, రాజ్‌కుమార్, మహానంది, రంగన్న, గొల్ల మహానంది, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లికి వందనంతో ఆనందం

తుగ్గలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న తల్లికి వందనం పథకంతో కుటుంబాల్లో ఆనందం వచ్చిందని ఆ పార్టీ నాయకులు అప్పా వేణుగోపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడ్ అన్నారు. ఆదివారం ఉప్పర్లపల్లిలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనంతో పాటు సన్నబియ్యంతో భోజనాన్ని వడ్డిస్తురని తెలిపారు. మనోహర్, విశ్వనాథ్, తదితరులు ఉన్నారు.

తల్లికి వందనంలో కోత..

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మొండిచేయి
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు వర్తింపు
- ప్రభుత్వంపై అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆగ్రహం


అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

ఆలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడిని దూరం చేసింది. అలాగే టీడీపీ ప్రభుత్వం సైతం కూడా అదేబాట పట్టడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

చిరుద్యోగులకు నిరాశ...

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అంతంత మాత్రమే. నెలకు రూ.10 వేల నుంచి రూ.18 వేలకు మించి ఉండదు. అటువంటి చిరుద్యోగులను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతూ అనర్హులుగా చేశారు. అయితే కాంట్రాక్ట్ ఉద్యోగుల పిల్లలకు మాత్రం తల్లికి వందనం పథకాన్ని అమలుచేయడంపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మండి పడుతున్నారు. రూ.45వేలకు పైగా జీతాలు తీసుకుంటున్న జూనియర్ లెక్చరర్లు, స్టాఫ్‌నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్లు, కస్తూర్బా, ఎంఆర్‌సీలు ఇలా అందరికీ పథకాన్ని అమలుచేసి తమను నిర్లక్ష్యం చేయడంపై అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆప్కాస్ పేరిట కోత..

గత వైసీపీ ప్రభుత్వం అన్నిశాఖల్లో ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్)ను ఏర్పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అందులోకి మార్పు చేసింది. సీఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లిస్తుండడంతో గత ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు మొదటిసారి మాత్రమే పథకాన్ని అమలుచేసి అనంతరం అనర్హులుగా చేయడంతో వారు తీవ్ర ఆందోళన చెందారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు వర్తింపజేయాలి



గత వైసీపీ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను దూరం చేసింది. అయితే రూ.45 వేలకు పైగా జీతం తీసుకుంటున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల పిల్లలకు వర్తింపచేసి, అవుట్ సోర్సింగ్ వారికి పథకాన్ని వర్తింపచేయకపోవడం అన్యాయం. మంత్రి లోకేష్ పునరాలోచించాలి.

- దాస్, జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, కర్నూలు